రోడ్డు ధ్వంసం.. ప్రయాణం నరకం

- అధ్వానంగా కూచిపూడి రహదారి
- అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గుంతలమయంగా కూచిపూడి రోడ్డు

కోదాడరూరల్ : మండలంలోని కోదాడ– మేళ్లచెరువు ప్రధాన రహదారి మధ్యలో తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా రోడ్డును బీటీగా మార్చాలని గత ఆరు సంవత్సరాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పీఆర్ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు మారిందని అధికారులు చెప్పి మూడు సంవత్సరాలు గడస్తున్నా నేటికీ ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

సిమెంట్ లారీల రాకపోకలతో..

కాగా, కోదాడ నుంచి కూచిపూడి, కూచిపూడితండాలతో పాటు మేళ్లచెరువు మండలంలోని మరికొన్ని గ్రామాలకు వెళ్లే వారికి ఈ రోడ్డే ప్రధాన మార్గం. అయితే మేళ్లచెరువు మండలంలో ఉన్న పలు సిమెంట్ పరిశ్రమల లారీలు రామాపురం క్రాస్‌రోడ్ మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉన్నప్పటికి ఈ మార్గంలోనే వెళ్తున్నాయి. ఇలా వెళ్తే దూరం తగ్గడంతో పాటుగా అంతరాష్ట్ర చెక్‌పోస్టులను తప్పించుకునే అవకాశం ఉండటంతో భారీ లోడ్‌లు గల వందల వాహనాలు కూడా ఈ మార్గం గుండానే ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. మరోపక్క రోడ్డు నిర్మాణ సమయంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోనే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ ఏ గుంత ఉందో అర్థంకాక ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా కాల్వకట్ట..

అయితే కూచిపూడి రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో పక్కనే ఉన్న తొగర్రాయి మేజర్ కాల్వకట్టపై నుంచి రెండు సంవత్సరాలుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కాల్వకట్ట కూడా గుంతలమయంగా మారింది. వెరసి కట్ట బలహీనంగా తయారవుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కూచిపూడి రోడ్డును బీటిగా నిర్మించి ప్రజల సమస్యలు తీర్చాలని అనేకసార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించాం. అయినా నేటివర కు ఎలాంటి ఫలితం లేదు. పలుసార్లు మండల స ర్వసభ్య సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్ర స్తావించి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి పనులు ప్రారంభిస్తాం అంటున్నారు కానీ నేటి వరకు అతిగతి లే దు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి.

– శంకరశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ, కూచిపూడి

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం


నడిగూడెం : సిరిపురంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


కోదాడ : పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

నడిగూడెం : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాగిత రామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేస్తుందన్నారు. ఆడపిల్లలు పుడితే అరిష్టంగా భావించిన కుటుంబాలు నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లబ్ధిదారులకు పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల కవిత, ఇన్‌చార్జ్ తహసీల్దార్ జవహర్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, గ్రామాల సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, అట్లూరి నాగేందర్‌రెడ్డి, మంచికంటి వెంకటరెడ్డి, ఎంపీటీసీ గార్లపాటి మాలతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, దేవబత్తిని సురేష్‌ప్రసాద్, పాలడుగు ప్రసాద్, అనంతుల ఆంజనేయులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కోదాడ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని, చేరిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మునగాల మండలం విజయరాఘవాపురం సర్పంచ్ యశోద రమేష్‌తో పాటు పలువురు పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేసి, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సుంకర అజయ్‌కుమార్, తొగరు రమేష్, గుండు లింగారావు, కోటయ్య, చిర్ర శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ సభ్యత్వాలపై చర్యలు తీసుకోవాలి

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ఊరచెరువులో ముదిరాజ్‌లకు నకిలీ సభ్యత్వాలు ఉన్నాయని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు విలేకరులకు తెలిపారు. చెరువు సంఘంలో చనిపోయిన వారి స్థానంలో అక్రమంగా డబ్బులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కొత్త సభ్యులను తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత చెరువు సంఘం నిర్వాహకులపై విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ కేసులు బనాయిస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

కోదాడ : పత్రికా విలేకరులపై అక్రమ కేసులు బనాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని, ఈ విషయంలో పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘంలో చేరిన 19మంది జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు.

కార్యకర్తలకు అండగా జనసేన

పాలకవీడు : జన సైనికులకు అండగా జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్య నిర్వాహక సభ్యుడు సరికొప్పుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుపై ఆయన అవగాహన కల్పించారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్న ప్రతీఒక్కరికీ బీమా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. జీవిత బీమా రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు గాయపడిన వారికి రూ.50వేల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు శ్రీను, సాయిచరణ్, మధు, శ్రీనివాసరెడ్డి, పవన్, వెంకటేష్, నరసింహనాయుడు, జహంగీర్ పాల్గొన్నారు.

గ్రీన్ ఉడ్ పాఠశాల వార్షికోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్ ఉడ్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి జనార్దన్, ఎంఈఓ సైదానాయక్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జె.నాగేశ్వరావు, డాక్టర్ శివప్రసాద్, చైర్మన్ సరిత మర్రెడ్డి, కరస్పాండెంట్ కృష్ణారావు, రాజారెడ్డి, తామస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయి మందిరంలో నిర్మిస్తున్న భోజనశాలకు మండల కేంద్రానికి చెందిన పందిరి శ్రీనివాసరెడ్డి కవిత దంపతులు ఆదివారం రూ.26,111లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలునాయక్



మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంతండాకు చెందిన మాళోతు బాలునాయక్ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాలునాయక్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో తనతో పాటు జిల్లాలోని చివ్వెంల మండలం మూన్యాతండాకు చెందిన బానోతు రాజేందర్‌నాయక్ జిల్లా కార్యదర్శిగా, 9మంది ఆఫీస్‌బేరర్స్‌తో పాటు, 21మందిని జిల్లా కమిటీలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వెంకటేష్‌శర్మ ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన మహాపడి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆలయ నూతన చైర్మన్‌గా ఎన్నికైన మండాది ఆంజనేయులుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. కార్యక్రమంలో పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రీ, గురుస్వామి వీరమళ్ల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


అయ్యప్ప ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న పూజారులు, భక్తులు

మహిళా సాధికారతకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్తెల సృజన

చిలుకూరు : మహిళా సాధికారతకు మహిళలు ఉద్యమించాలని భారత మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో నిర్వహించిన మండల స్థాయి మహిళా సమాఖ్య కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పతల కోటమ్మ, దేవరం మల్లేశ్వరీ, నాయకురాళ్ల లక్ష్మి, సాతులూరి అలివేలు, రెమిడాల జయసుధ, అంజమ్మ, వెంకటరమణ, సరస్వతి, సుజాత, మహముదా భేగం, కౌసల్య, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పోరుయాత్ర సభను విజయవంతం చేయాలి


గరిడేపల్లి : మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈనెల 28న నిర్వహించే గ్రామపంచాయతీ కార్మికుల పోరుయాత్ర సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లచట్టాలను తక్షణమే తొలగించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ముత్యాలమ్మ, వెంకటరత్నం, రాజలింగం, సిబ్బంది, నాయకులు తదితరులున్నారు.

మఠంపల్లి : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేసి వారికి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోరుయాత్ర సభను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రస్‌మియా కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామపంచాయతీ కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు కరోనా కాలంలో ముందుండి ప్రజలకు అందించిన సేవలను కొనియాడిన ప్రభుత్వం వారికి కనీస వేతనాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. పోరాటం చేస్తే తప్ప ప్రభుత్వంలో కదలిక వచ్చే పరిస్థితి లేదని కార్మికులంతా పోరుయాత్రతో కదంతొక్కాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు రవి, దేవదానం, గురువారెడ్డి, ప్రసాదరెడ్డి, దావీదు, మైసయ్య, అంజయ్య, రహీం, కిట్టయ్య, తదితరులున్నారు.

కళారూపాలతో పాలకుల ఆటకట్టించాలి


జెండా ఎగురవేస్తున్న నాయకులు

గరిడేపల్లి : కళారూపాలతో పాలకుల ఆటకట్టించాలని అరుణోదయ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని వెలిదండలో అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య రాష్ట్ర స్థాయి డప్పు, పాటలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా అరుణోదయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వెలిదండ గ్రామంలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళ కళకోసం, కాసుల కోసం కాదని, ఈ కళ కేవలం ప్రజల కోసమేనని అన్నారు. దోపిడీ వ్యవస్థతో పాటు బూర్జువా సాంస్కృతికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. పాటలు, డప్పు కళారూపాల ద్వారానే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతి సమైఖ్య రాష్ట్ర నాయకులు రాయి కృష్ణ, ఉదయగిరి, చిరంజీవి, అబేద్నగో, తడకమళ్ల సంజీవ్, ఎర్ర ఉమేష్, కాంతారావు, నాగేశ్వర్‌రావు, రమణరావు, కిషన్, గుండు నాగేష్, భానేష్ తదితరులున్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం


మాట్లాడుతున్న జల్లెపల్లి వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్ తెలంగాణ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జల్లెపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో భూదందాలు, ఇసుక మాఫియా పెరిగిపోయాయన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలైన 108, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేస్తుందన్నారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. త్వరలో మండల, పట్టణ నూతన కమిటీలు వేస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తురక శ్రీనివాస్, హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కుక్కడపు ఉపేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


పూజలు చేస్తున్న అర్చకులు

చిలుకూరు : పాత చిలుకూరులోని ముత్యాలమ్మ నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణంలో హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాలకవీడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ భూక్యా గోపాల్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం 11గంటలకు హాజరు కావాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ గెలుపుపై హర్షం

సూర్యాపేటటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి ఘనవిజయం సాధించటం పట్ల జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, నరసింహారావు, కిషోర్, నవీన్ ఉన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి


కోదాడఅర్బన్ : ఆయుష్మాన్ భారత్ పథకం కేవైసీ చేస్తున్న నాయకులు


కోదాడరూరల్ : తొగర్రాయిలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కోదాడఅర్బన్ : భారత ప్రధాని నరేంద్రమోదీ అందరికి ఆరోగ్యం అందాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకోచ్చారని, ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మునగ నరేష్ ఆధ్వర్యంలో సుమారు 500మందికి ఆయుష్మాన్ భారత్ కేవైసీని యాప్ ద్వారా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా సుమారుగా 1600 జబ్బులకు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కోటకొమ్ముల భాగ్యలక్ష్మి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొదుమూరి ప్రవీణ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, తొగర్రాయి, కూచిపూడి, శ్రీరంగాపురంలో ఈ కేవైసీ ద్వారా వెబ్‌సైట్‌లో పొందుపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి పాండు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీఐటీయూ కార్యాలయ స్థలానికి తప్పుడు ప్రతాలు సృష్టించి అక్రమంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నాగారపు పాండు కోరారు. ఆదివారం ఆపార్టీ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఐటీయూ కార్యాలయం నిర్మాణం కోసం పట్టణంలోని మిర్యాలగూడెం రోడ్డులో సర్వే నంబర్ 138లో 10కుంటల స్థలం కోసం 1990లో అప్పటి తహసీల్దార్‌కు సంఘం నాయకులు దరఖాస్తు చేశారని, ఈ భూమి గ్రామకంఠంలోకి వెళ్లడంతో వేయ్యి గజాలు కార్యాలయ నిర్మాణానికి కేటాయించాలని గ్రామపంచాయతీ అనుమతి కోరినట్లు తెలిపారు. దీంతో ఆ స్థలంలో రేకులషెడ్డు నిర్మించి ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నామని, 15 ఏళ్లుగా సీఐటీయూ నాయకుడిగా ఉన్న శీతల రోషపతి మున్సిపాలిటీలోని కొందరిని అడ్డుపెట్టుకుని సంఘం ఆధీనంలో ఉన్న భూమిని తన బావమరిది పేరుమీద అసైన్‌మెంట్ చేయించుకుని తర్వాత తన భార్య పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, నాయకులు దుగ్గి బ్రహ్మం, పి.హుస్సేన్, టి.యోనా, జె.వెంకటేశ్వర్లు, ఆర్.మురళి, ఎం.సీతయ్య, పి.వెంకటనారాయణ, ముసలప్ప, నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

బదనాం చేయడానికే చీటింగ్ కేసు

హుజూర్‌నగర్ : పట్టణంలోని స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో తనపై చీటింగ్ కేసు నమోదు చేయించి బదనాం చేస్తున్నారని పట్టణానికి చెందిన టి.సైదులునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిషనర్ అధికారిగా కాకుండా కొందరికి తొత్తుగా మారాడని ఆరోపించారు. వారు అడిగినంత డబ్బులు ఇవ్వలేదని తనపై చీటింగ్ కేసు నమోదు చేయించారని ఆరోపించారు. స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అన్ని ధృవపత్రాలు ఉన్నాయని తాము ఎవరినీ మోసం చేయలేదని అన్నారు.

సాగునీరందక ఎండుతున్న పొలాలు

- వారబందీ విధానంతో అందని సాగునీరు
- దిక్కుతోచని స్థితిలో పాలారం మేజర్ (14బి) కాల్వ కింద రైతులు


నడిగూడెం మండలం వల్లాపురం వద్ద ఎండిపోతున్న వరిపొలం

నడిగూడెం : ఆరుగాలం కష్టపడి వరిపంటను సాగు చేస్తే, తీరా పొట్టదశలోకి వచ్చిన పొలాలు ఎండిపోతుండడంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు అప్పులు చేసి రబీ సీజన్‌లో వరిసాగు చేస్తే తీరా పొట్టకు వచ్చే దశలో సరిపడా సాగు నీటిని అందించకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో ఆ రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇది నడిగూడెం మండల పరిధిలోని సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న పాలారం మేజర్ (14బీ) కాల్వ కింద ఉన్న రైతుల పరిస్థితి. ఈ కాల్వ ద్వారా మండల పరిధిలోని సిరిపురం, వల్లాపురం, అనంతగిరి మండలం త్రిపురవరం, పాలారం, చనుపల్లి గ్రామాలకు నీరందుతుంది. ప్రస్తుత రబీ సీజన్‌లో నీటి పారుదల శాఖ వారాబందీ విధానం అమలు చేస్తుంది. దీంతో చాలీచాలని నీరు విడుదల చేస్తుండడంతో సిరిపురం, వల్లాపురం, త్రిపురవరం, పాలారం గ్రామాల రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. ఈ కాల్వ కింద దాదాపు 100ఎకరాలకు పైగా ఎండిపోతున్నాయి.

ఆందోళనలో రైతులు..

ప్రస్తుత రబీ సీజన్‌లో నీటి పారుదల శాఖ వారాబందీ అమలు చేస్తుంది. అలాగే మేజర్ కాల్వలతో పాటు మైనర్ కాల్వలు కూడా లైనింగ్ లేకపోవడం, పలు చోట్ల కాల్వలు పూడిపోయాయి. పలు చోట్ల నాచు పేరుకపోయింది. అలాగే అనేక మంది రైతులు కాల్వపై మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే నీటిని కూడా సరిపడా విడుదల చేయడం లేదు. దీంతో రైతుల పొలాలకు సరిపడా నీరందకపోవడంతో ఎండే పరిస్థితి దాపురించిదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొలాలకు సరిపడా నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొలం ఎండుతుంది



పాలారం మేజర్ కాల్వ కింద నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నాం. ప్రస్తుత రబీ సీజన్ ఆరంభం నుంచి సరిపడా నీరందడం లేదు. వేల రూపాయలు అప్పులు చేసి వరి సాగు చేపట్టాము. పొలాలు పొట్టదశకు వచ్చే సమయంలో నీరందడం లేదు. నాలుగు ఎకరాల పొలం ఎండుతుంది.

– వల్లపురెడ్డి తిరుమలరెడ్డి, రైతు, వల్లాపురం

అధికారులు స్పందించాలి



పాలారం మేజర్ కాల్వ కింద ఒక ఎకరంలో వరిసాగు చేశాను. కొద్ది రోజులుగా చాలీచాలని నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పొలం ఎండిపోతుంది. సంబంధిత అధికారులు స్పందించి వారాబందీని ఎత్తివేసి, సరిపడా నీటిని విడుదల చేసి పొట్టదశలో ఉన్న పొలాలను కాపాడాలి.

– ఎస్‌కె.జాన్‌బాబు, రైతు, వల్లాపురం

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు : ఆర్డీఓ


రేషన్‌దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : రేషన్ దుకాణాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ వెంకారెడ్డి అన్నారు. పట్టణంలోని 27, 31 నంబర్ రేషన్‌దుకాణాలు ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీ, స్టాక్ రిజిస్టర్, వసతులను పరిశీలించారు. దుకాణాల వద్ద ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అసౌకర్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీటీ సీఎస్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న వాగ్దేవి విద్యాసంస్థల చైర్‌పర్సన్ వసంతవెంకటరెడ్డి

కోదాడఅర్బన్ : ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని, చదరంగంతో పిల్లల్లో మేథోశక్తి పెరుగుతుందని వాగ్దేవి విద్యాసంస్థల చైర్‌పర్సన్ బాణాల వసంతవెంకటరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో బాణాల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–15 చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 161మంది క్రీడాకారులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాగా ఈ పోటీల్లో అండర్–15 బాలుర విభాగంలో మొదటి బహుమతి జి.పృథ్వీ, అండర్–13లో రిజ్వాన్, అండర్–11లో చిద్విలాషిని, అండర్–9లో లక్ష్మీదీపిక, అండర్–7లో శాలిని మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నర్సింహారావు, చీఫ్ ఆర్బిటర్ రవికుమార్, మెంటర్ సత్యనారాయణ, కళాశాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.